**విశాలమైన** కాలేజి వరండాలో ఎక్కడబడితే అక్కడ జనం... గుంపులు గుంపులుగా విద్యార్థులు లైబ్రరీలో కొన్ని గుంపులు—లేబరేటరీ ముందు కొన్ని గుంపులు—స్టూడెంట్స్ యూనియన్ హాల్లో కొంతమంది — బయట కొంత మంది—మేడ మీదకు వెళ్ళే దార్లో కొంతమంది—మెట్ల మీద కొంతమంది—ఎక్కడ చూసినా విద్యార్థులు...విద్యార్థులు.

అబ్బాయిలకు దూరంగా మర్రిచెట్టు చపటా మీద చుట్టూ అమ్మాయిలు. పోకచెట్టుకింద కొంతమంది—కాలేజి ఆడిటోరియం మెట్లమీద, సిమెంటు స్టేజి మీద, తోటలో బాదం చెట్టు ముందు, నేరేడు చెట్ల ముందు, అక్కడక్కడ అంచక్కా ఒయ్యారంగా నిలబడ్డ పాలరాతిబొమ్మల స్తంభాల కానుకుని మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ తుళ్ళుతూ, కేరింతలు కొడుతూ, పాటలు పాడుకుంటూ జోకులు వేసుకుంటూ, వచ్చిపోయే వారిని కామెంట్స్ చేస్తూ, అబ్బాయిల అల్లరి మించిపోయేటట్టుగా అల్లరి చేస్తూ పూలతోటలో విరియబూసిన రంగు రంగుల, రకరకాల పూలలా అమ్మాయిలు... అమ్మాయిలు ...

అప్పుడు ఉదయం పది గంటలు దాటింది. ప్రేయర్ బెల్ కొట్టారు. చాలామంది విద్యార్థులు ప్రేయర్‌కి వెళ్ళలేదు. తరవాత ఫస్టుబెల్ కొట్టారు. చాలామంది విద్యార్థులు క్లాసుల్లోకి వెళ్ళలేదు.

కొత్తగా చేరిన విద్యార్థులతో కళాశాల కొత్త కొత్తగా మెరుస్తూంది. తరగతి గదులన్నీ కోలాహలంగా ఉన్నాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థుల్ని ఆప్యాయంగా దగ్గరకు పిలిచి, వారి వివరాలడిగి వారిని 'ఫూల్స్'ని చేస్తున్నారు. అంతా కొత్త కావటం వలన జూనియర్ విద్యార్థులు నిజాలు చెప్పేసి, వెలవెలబోయిన ముఖాలతో, సీనియర్ల నవ్వుల్ని భరించలేక ఏడుపు ముఖాలు పెట్టేస్తున్నారు.

చాలామంది విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్ళటం లేదు, లెక్చరర్స్ ఇంకా రాలేదు కాబట్టి.

చొరుగ్గా గదుల్లోకి వెళ్ళే అమ్మాయిల్ని రకరకాల పేర్లతో ఏడిపిస్తూ, పిలుస్తూ, ఆనందంగా నవ్వుకుంటున్నారు. ఇంకొంతమంది తరగతి గదుల్లో 'పిపీపాటల ఆర్కెస్ట్రా' మొదలెట్టారు.

సరిగ్గా ఆ సమయంలో ఆఫీస్ రూమ్స్ లోంచి కొంతమంది లెక్చరర్స్ బయట కొచ్చారు.

విశాలమైన వరండా. మేడమీద ఇరవై గదులు. కింద ఇరవై గదులు. కిటికీల్లోంచి లెక్చరర్స్ రాకని పసికట్టి సీనియర్స్ గప్‌చుప్‌గా అయిపోయారు. జూనియర్ విద్యార్థులు మాత్రం ఎవరు లెక్చరరో, ఎవరు స్టూడెంటో తెలీక లెక్చరర్స్‌ని గుర్తుపట్టే ప్రయత్నం చేస్తున్నారు.

లెక్చరర్స్ ఠీవిగా అయా తరగతి గదుల్లోకి వెళ్ళారు. ఆ తరగతి గదుల్లో ఒక గదిలోకి రామనాథం వెళ్ళాడు.


రామనాథానికి ఏభై ఏళ్ళుంటాయి. పేరు పొందిన ఆ కళాశాలలో ఆయన ముప్పై ఏళ్ళ బట్టి పని చేస్తున్నాడు. సబ్జక్టు విషయంలో కాని, సీనియార్టీ విషయంలో కాని తన తరవాతే మిగతా వాళ్ళందరూ అనుకుంటాడు ఆయన తన మట్టుకు తాను.

కానీ అలా ఎవ్వరూ ఖాతరు చెయ్యరు. దాని క్కారణం ఆయన సబ్జక్టులో ప్రతి సంవత్సరం ఎవరూ పాసవరు. ఆ విషయం ఆయనతో ఎవరైనా అంటే, "వెధవలకి స్టాండర్డు లేదు. స్టాండర్డు లేని వెధవలకి సీట్లిస్తే అంతే" అని విసుక్కుంటాడు.

రామనాథం నల్లపేంటు మీద తెల్లచొక్కా ఇన్‌షర్ట్ చేశాడు. బట్టతల—కళ్ళద్దాలు.

క్లాసులోకి వెళ్ళాడు.

విద్యార్థులందరూ లేచి నిలబడ్డారు. ఒక్కసారి అందరివేపూ చూశాడు. దాదాపు నూట ఏభై మంది ఉన్నారు విద్యార్థులు. అందులో ఏభై మంది విద్యార్థినులు ముందు బెంచీల్లో కూర్చున్నారు.



"సిట్‌డౌన్... మై డియర్ బాయిస్!" విద్యార్థులందరూ కూర్చున్నారు. క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది. విద్యార్థులందరూ ఆయన వేపే చూస్తున్నారు. అది ఫైనలియర్ క్లాసవటం వలన ఆయన సంగతి చాలామందికి తెలుసు, క్లాసులో పాఠం చెప్పడని. ఆయనకి రాజకీయాలంటే చాలా ఎక్కువ మక్కువ. కానీ ఆయన ఏ పార్టీని సమర్థించడు.


"సీ మై డియర్ బాయిస్. నన్ను మీలో చాలామందికి తెలుసు— ఈ కాలేజీలో మోస్ట్ సీనియర్‌ని, సిన్సియర్‌ని. కాని మేనేజిమెంటు వారు పక్షపాత బుద్ధితో తమ ఆశ్రితులకే ప్రమోషన్లిచ్చారు. కాబట్టే నే నింకా ఇలాగే ఉండిపోయాను. లేకపోతే వైస్-ప్రిన్సిపాల్‌ని కావాల్సిన వాణ్ణి. కానీండి—ఎక్కడ లేదు ఆశ్రితపక్షపాతం! ఈ దేశం దేశమంతా ధ్వంసమై పోయింది. మరి ఇప్పట్లో బాగుపడదు."

ఆయన గమ్మత్తుగా టాపిక్‌ని మార్చేస్తాడు. ఆయన ఒరిజినల్ వేలోకి వెళ్ళిపోతాడు. అలాగ రామనాథం ఇరవై నిమిషాల సేపు దేశం నిండా వ్యాపించిన కుళ్ళు, కుత్సితాల గురించి మాట్లాడి, మాట్లాడి అలిసిపోయి విద్యార్థుల వేపు ఒకసారి చూశాడు.

సరిగ్గా అదే సమయంలో బంట్రోతు వచ్చాడు. సర్క్యులర్ చూపించాడు. దాన్ని చదివి, ఆ

# వేరు పురుగులు

దాట్ల నారాయణమూర్తి రాజు



బంట్రోతు చేతి కిచ్చాడు. బంట్రోతు వెళ్ళి పోయాడు.


"నా మట్టుకు నాకు ఈ దేశంలో మిలిటరీ పాలన ఇష్టం. కానీ దేశంలో ఎలక్షన్లు ఉన్నాయి. మనకెందుకురా ఎలక్షన్లు...నాలాంటి మేధావుల్ని, వాళ్ళ సలహాల్ని ఈ దేశం గౌరవించడం మానే సిందీ—ఇవన ప్రిన్సిపాల్‌తో సహా. అప్పటికీ చెప్పాను, కాలేజీలో ఎలక్షన్లెందుకని? వినలేదు—కానీండి.

మీకు ఎలక్షన్లట. మిగతా వివరాలు ఆఫీసులో ఇస్తారు. వెళ్ళండి. ఇవాళ క్లాసులు మరి లేవు."

ఆయన లేచిపోయి బయట కొచ్చేశాడు.

• • •

కిటికీలోంచి చూస్తే కోనేరు కనబడుతూంది అప్పటికి సమయం సాయంత్రం అయిదైంది. కిటికీ రెక్కకి ఆనుకుని కూర్చుని కోనేటి వేపు, గుమ్మా వేపు చూస్తున్నాడు శరత్‌కుమార్.




ఆ గది విశాలంగా ఉంది.

ఆ గదిలో ఒక పక్క బ్రూస్‌లీ బ్లోఅప్, దాని కెదురుగా అప్పం కొడెక్ లెపర్ట్ బ్లో అప్ ఉన్నాయి. ఇంకో పక్క గోడకి దీపం వెలిగిస్తూ, బియ్యం ఏరుతూ, ఓరగా చూస్తూ ఉన్న అమ్మాయిల పెయింటింగ్స్ కేలండర్లున్నాయి.

శరత్‌కుమార్ చేతిలో సిగరెట్ ఉంది.

"అయితే ఈసారి తప్పదంటావా..." సిగరెట్ దమ్ము కొట్టి ఎదురుగా కూర్చున్న వాణ్ణి అడిగేడు.

"ఈసారి మన్దే జయం. క్రితం సార్లైతే ఆ కోతి గాణ్ణి నమ్మి మనం ఓడిపోయాం. ఈసారి పకడ్బందీగా ప్లానేసుకుందాం. నీ కెందుకు?" అని అందరివేపూ చూశాడు సుబ్రహ్మణ్యం.

"అవున్నా..." సుబ్రహ్మణ్యం మాటకి వంత పలికేరు మిగతా మిత్రబృందం.

అప్పుడు శరత్‌కుమార్ లేచి తన చేతిలోని సిగరెట్స్‌ని అందరికీ ఇచ్చి 'ఛీర్స్' కొట్టాడు.

"హిప్ హిప్...హుర్రే..." అందరూ సంతోషానికి గుర్తుగా 'నాంది' అరుపులు అరిచేరు. ఆ తరవాత వాళ్ళందరూ మురుగా విలాస్‌కి నడిచేరు. అక్కడ టిఫిన్ బిల్లు ముప్పై అయిదు రూపాయలూ శరత్‌కుమార్ ఇచ్చాడు.

• • • •

అదిభట్ల నారాయణదాసు వీధిలో ఆ ఇంట్లో మేడమీద రెండో గదిలో చాలా కోలాహలంగా ఉంది. ఒక పక్క పాంప్లెట్లు కుప్పలు, కుప్పలుగా పడి ఉన్నాయి. ఇంకో పక్క తడకల మీద న్యూస్ పేప ర్లంటిస్తున్నారు. ఇంకో పక్క కొంతమంది గోడల మీద రాయడానికి డబ్బాల్లో రంగులు కలుపుతున్నారు. ఒక పక్క టేపురికార్డర్లో హిందీ పాటలు పెద్దగా వినబడుతున్నాయి.

అప్పుడు మధు చక్రవర్తి వచ్చాడు. అతని వెనకాతల ఒక డజను మంది కుర్రాళ్ళు వచ్చారు. గదిలో ఉన్న కుర్రాళ్ళు మధు చక్రవర్తిని విష్ చేశారు.

"కాలేజీ గోడలన్నీ రిజర్వు చేశాం. రాత్రి వాటి మీద రాద్దాం. ఈ నైటు కంటిన్యూ చేస్తే ఉదయానికి అంతా అయిపోతుంది, బాస్!" ప్రభాకరం చెప్పాడు.

"మరి పాంప్లెట్లు..."

"ప్రెస్ నుంచీ అన్నీ తెచ్చేశాను. పదివేలు... అవసరమైతే చెప్తాను. కంపోజ్ చేసిన మేటర్ అలాగే ఉంచమని చెప్పాను ప్రెస్ వాడితో..." సుభద్రం చెప్పాడు.

"అంతా ఓకే నన్న మాట. మరి రాత్రి గోడ మీద రాయడానికి ఎవరెవ రున్నారు? ప్రభాకరం, నువ్వు! సుభద్రం...మరి..." అందరివేపూ చూశాడు మధు చక్రవర్తి.

"ఒక ఆర్టిస్టును కూడా తీసుకొద్దాం,



పెడుతారు?"

"అవును. ఒక ఆర్టిస్టుండాలి. లాభం లేదు. ఎందుకంటే ఇంకా వారం రోజుల్లేవు ఎలక్షన్లు."

"అయితే, ఒరే రాంబాబూ! నువ్వు మధురవాణి వీధిలోకి వెళ్ళి నేనొస్తానని చెప్పి అప్పారావుని తీసుకురా. రాత్రంతా ఉండాలని చెప్పు."

"అలాగే" అన్నాడు రాంబాబు.

"ఇదిగో చూడు. అతనికి ఎడ్వాన్స్ ఇవ్వు." వంద రూపాయలు తీసి రాంబాబు చేతిలో పెట్టాడు మధు.

రాంబాబు కిందకు దిగి స్కూటర్ స్టార్టు చేశాడు.

ఇంతలోకి కాఫీ లొచ్చాయి. అందరూ తాగారు. సిగరెట్లు వెలిగించారు.

మధు చక్రవర్తి గది మధ్య కుర్చీలో కూర్చున్నాడు. అతని చుట్టూ సారథు లందరూ కూర్చున్నారు. మధు చక్రవర్తి రెడ్‌విల్స్ సిగరెట్ తీసి వెలిగించి గట్టిగా పొగ పీల్చి ఇలా అన్నాడు.

"చూడండి, బ్రదర్స్. ఈ సారి చాలా జాగ్రత్తగా ఉండాలి మనం. క్రితం సారి మనం బొటా బొటిగా గెలిచాం. కానీ ఈ సారి పోటీ టఫ్‌గా ఉంది. లాస్ట్ టైమ్స్ ఓడిపోయి ఉండడం వలన శరత్‌కుమార్ పట్టుదలగా ఉన్నాడు. అన్ని వేపుల నుంచీ కమ్ముకొస్తున్నాడు. అన్ని ఏర్పాట్లూ ముందే చేసుకుంటున్నాడు. డబ్బులుకూడా పంచుతున్నాడట. కాబట్టి మన కిది ప్రిస్టేజి క్వశ్చన్. ఎంతైనా ఫరవాలేదు. మా డాడీతో చెప్పాను. అవసరం అయితే పోలీస్ సెక్యూరిటీకూడా మన కుంటుంది. ఎక్కడా ఎవరూ బెదరక్కర్లేదు. కొత్త గా చాలా మంది విద్యార్థులు కాలేజీలో చేరారు. వాళ్ళ రూములకి వెళ్ళాలి మనం. ఆ తరవాత అమ్మాయిల్ని ఇండివిడ్యువల్‌గా కలవాలి."

ఆగి అందరి వేపూ చూశాడు మధుచక్రవర్తి.

"అమ్మాయిలు మన కేస్తారంటావా? లాస్ట్ టైమ్ చాలామంది అమ్మాయిలు మనకెయ్యలేదు. అమ్మాయిల ఓట్లన్నీ మోతీ లక్ష్మి చేతిలో ఉన్నాయి. ఆ అమ్మాయి ఎంత చెబితే అంత సీనియర్స్ ఎలాగూ ఆ అమ్మాయి మాటనే వింటారు. వాళ్ళు చెబితే జూనియర్స్ వింటారు. ఆ మోతీ లక్ష్మి, అసదుల్లా మాట వింటుంది. అసదుల్లా శరత్‌కుమార్‌నే సపోర్ట్ చేస్తున్నాడు."

"అదిగాక. లాస్ట్ టైమ్‌కి. ఈ టైమ్‌కి కొంత ప్రోగ్రెస్‌కూడా ఉంది. మోతీలక్ష్మి, అసదుల్లా ప్రేమలో పడ్డారట. అలాగయితే మన కష్టమే." కృష్ణకుమార్ అన్నాడు.

"ఏం కష్టం కాదు. ఆ అసదుల్లా గాడు, మందు గాడు. రెండ్రోజులు మందు పోస్తే వాడు మన వేపే తిరుగుతాడు. ఆ మోతీలక్ష్మికూడా తిరుగుతుంది. మొత్తం అమ్మాయి లందరూ తిరుగుతారు. మనకే జయం." పురుషోత్తం అన్నాడు ఆనందంగా.

"అది నువ్వన్నంత సులభం కాదు." మధు చక్రవర్తి అన్నాడు.

"అయితే మనం ఏం చేద్దాం" అందరూ అడిగారు.

"ముందు మనం అసదుల్లా గాణ్ణి పట్టాలి.

అది ఆల ఎంచండి. వాడిల్లెక్కడ'' అని అడిగాడు మధుచక్రవర్తి.

''నల్ల చెరువు దగ్గర వాడిల్లు. ఎలక్షన్ల కదా శరత్‌కుమార్ రూమ్స్ లోనే ఉంటాడు.''

''ఒరే ఆంజనేయుడూ. నువ్వెళ్ళివాడెక్కడున్నాడో కనుక్కో. వీలయితే ఓకిల్ చేయ్యియాంకి తీసుకురా. నేను రమ్మన్నానని చెప్పు. రానంటే లాక్కొ చ్చెయ్యండి. అలాగేనా.''

ఆంజనేయుడు ఇంకో స్కూటర్ తీసుకుని వెళ్ళాడు.

• • • •

ఆ వేళ చక్కగా తెల్లవారింది.

బొంకుల్దిబ్బ దగ్గర నుంచి కాలేజీ వరకు గోడల నిండా మెరుస్తూ రకరకాల రంగులతో రాతలు. స్తంభాలకు కట్టిన బేనర్లు. రోడ్డు మీద తెల్ల సున్నంతో రాసిన రాతలు. ఆ చుట్టుపక్కల గోడల్లో ఒక్క అరంగుళమైనా ఖాళీగా లేదు.

చాలామంది విద్యార్థులు వైస్ ప్రెసిడెంటుగా, డ్రమెటిక్ అసోసియేషన్ సెక్రటరీగా, రిప్రజెంటివ్స్‌గా పోటీ చేస్తున్నా, వాళ్ళ మధ్య పెద్ద పోటీ లేదు. ఆ పోటీ చేసిన వాళ్ళుకూడా ఆటోమేటిగ్గా వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గం శరత్‌ని, ఇంకో వర్గం మధుని అంటిపెట్టుకుని ఉన్నాయి. కానీ ప్రధానంగా పోటీ శరత్‌కుమార్ మధ్య మధు చక్రవర్తి మధ్య ఉంది. అది వర్గాల మధ్య ప్రారంభమై వ్యక్తిగత పరువు, ప్రతిష్ఠలకు పెద్ద సవాల్ లాగా తయారయింది.

కాలేజి కాలేజీలా లేదు. 'ఫిష్ అఫ్ వేల్స్' మార్కెట్టులా ఉంది. ఎలక్షన్ల గొడవ అయిపోతేనే కాని కాలేజీ కాలేజీలా ఉండదు. ఎక్కడ బడితే అక్కడ విద్యార్థులు, స్కూటర్లు, కార్లు, సైకిళ్ళు, రిక్షాలు, అరుస్తున్న వాళ్ళు, తిరుగుతున్న వాళ్ళు.

ఎన్నికల వలన భయపడి చాలామంది అమ్మాయిలు కాలేజీకి రావడం లేదు. ఉన్న కొద్ది మంది అమ్మాయిలూ బెరకు బెరుగ్గా వస్తున్నారు. వాళ్ళని దారి పక్కన నిలబడ్డ అబ్బాయిలు వెక్కిరిస్తూనార్లు 'నిక్‌నేమ్స్'లతో పిలుస్తున్నారు.

సరిగ్గా ఆ సమయంలో కాలేజీ బయట వేప చెట్టు కింద తన వర్గంతో మధు చక్రవర్తి నిలబడి ఉన్నాడు. అతని చుట్టూ సుభద్రం, రాంబాబు, ఆంజనేయుడు, కృష్ణకుమార్ మొదలగు జనం నిలబడ్డారు. అతనికి ఒళ్ళంతా కుతకుతలాడి పోతూంది. మొట్టమొదటిసారి అతని పథకం ఒకటి దెబ్బతిన్నది. తన అనుకున్నది అనుకున్నట్టుగా జరగలేదు.

నిన్నరాత్రి—

అనదుల్లా తన మాట కాదనీసేడు. రెండువేల వరకూ ఇస్తానన్నాడు. వాడు పుచ్చుకోలేదు. మందుకీ లొంగలేదు. అప్పట్నించి మధు చక్రవర్తి మనసు మనసులో లేదు. అది అపజయం వేపు పీకుతూంది. తను ఈ ఎలక్షన్లలో ఓడిపోతే తన పరువు పోతూంది. తన డాడీ... ఆయన పరువు కూడా తన వల్ల పోతుంది.


రాజకీయాల్లో తిరిగిన తన డాడీ ఏనాడూ ఓడిపోలేదు. పట్టణంలో కీలకమైన పదవిలో ఉన్నాడాయన. అలాంటి వాడికి కొడుగ్గా పుట్టి తను ఈసారి ఓడిపోవడమా!

డబ్బు ఎంతైనా పర్వాలేదు. చదువు పాడైనా పర్వాలేదు. ఏది ఏమైనా తను గెలవాలి. లాభంలేదు. లాభం లేదు. ఏం చెయ్యాలి? ఆ అనదుల్లాగాడు? తన మాట కాదనీసేడు. అంటే మోతీలక్ష్మి కాదనీసినట్టే లెక్క. అంటే ఆడవాళ్ళ ఓట్లు తనకు రావు. రాకపోతే తను ఓడిపోతాడు. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి...

''చక్రవర్తీ...చక్రవర్తీ'' అరిచినట్టుగా పిలిచాడు సుభద్రం.

అప్పుడు ఎదురుగా చూశాడు మధు చక్రవర్తి. మోతీలక్ష్మి.

చిలకాకు పచ్చ వివల్ 'డిజైన్‌వ్యావెర్' చీరలో చాలా అందంగా ఉంది. సన్నగా, పొడుగుగా ఉంది.



కళ్ళ చివరల వరకు దిద్దిన కాటుక, గుండ్రంగా పెట్టిన బొట్టు, చెవులకు రింగులు, చేతికి ఎలక్ట్రానిక్ వాచీ, హైహీల్సు ప్రాణం పోసుకుని నడిచే మంచి గంధం బొమ్మలా ఉంది.

ఆ అమ్మాయి వెనక అందంలోనూ, ఆకర్షణలోనూ ఆ అమ్మాయికి ఏమాత్రం తీసిపోని ఒక డజను మంది అమ్మాయిలు రకరకాల చీరల్లోను, పంజాబీ డ్రెస్సుల్లోనూ, మిడీల్లోనూ ఆరోగ్యంగా ఉన్నారు.

వాళ్ళను చూసి కుర్రాళ్ళు హుషారెక్కిపోయారు. కాలేజీకి ఎదురుగా కిళ్ళీబడ్డీ పక్కన నిలబడ్డ శరత్‌కుమార్ వర్గం వారు 'మనదే జయం మనదే విజయం'' అని అరిచేరు. శరత్ మీద, మోతీ మీద కోపంగా ఉన్న మధుచక్రవర్తి వర్గం ''వోట్ ఫర్ మధు'' అని గట్టిగా అరుస్తూనే ఉన్నారు.

అబ్బాయిల ఆవేశాన్ని, అల్లరిని, అర్భాటాన్ని అన్నిటని చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ అమ్మాయిలు కాలేజీలోకి వెళ్ళిపోయారు.

''మోతీలక్ష్మితో మాట్లాడాలి. ఎలాగ?'' ఆంజనేయుణ్ణి అడిగేడు మధు.

''ఇంటికెళ్తే బావుంటుందేమో?''

''ఇంటిదగ్గ..రా! అరడజను కుక్కలుంటాయిరా నాయనా. దాన్నాన్న ఇంకో కుక్కలాగా ఉంటాడు. కరిచేస్తాడు. ఇక్కడే మాట్లాడు.'' కృష్ణకుమార్ అన్నాడు.

''ఆ అమ్మాయి జంక్షను వెళ్ళే లోపున నువ్వు స్కూటరు మీదెళ్ళ మాట్లాడి ఈ ఎలక్షన్లలో నిన్ను సపోర్ట్ చెయ్యకపోతే గొడవలై పోతాయన్నెప్పు, ముందు మామూలుగా చెప్పు. అదేమైనా గీరగా చెప్తే దనుకో వార్నింగివ్వు. అందుచేత చెప్పాను. ఒక ఆర్నెలు ముందే జాగర్తపడమని. ముందుగా ఆ అమ్మాయిని వల్లో వేసుకుంటే ఇప్పుడీ బాధ తప్పేది కదరా''

రాంబాబు జోకు కూడా వేశాడు.

''ఇడియట్ ఇప్పుడు జోకులేవిట్రా'' కసిరాడు మధు

అంతట్లో మోతీలక్ష్మి వాళ్ళు ససైన్యంగా బయటకొచ్చారు. మళ్ళీ ఇరువర్గాల అరుపులు.గోల. ఆ అమ్మాయిలు దగ్గర పడుతున్న కొలదీ అబ్బాయిల ముఖాలు తేజస్సుతో దీపాల్లా వెలుగుతున్నాయి.

ఆ అమ్మాయిలు వాళ్ళని దాటి వెళ్ళిపోయారు. వాళ్ళు గంట స్తంభం దగ్గర మీనాక్షి హోటల్లో కూర్చున్నారు.

వాళ్ళ వెనకే మధు చక్రవర్తి, ఆంజనేయుడు స్కూటర్ మీద ఫాలో అయ్యారు. హోటల్ ముందు ఆంజనేయుడు నిలబడ్డాడు. లోనికి మధు చక్రవర్తి వెళ్ళాడు.

లేడీస్ రూమ్‌లో కూర్చున్నారు అమ్మాయిలు. మోతీలక్ష్మి స్వీట్ ఆర్డర్ చేసింది. ఒక డజను

స్వీట్లు బేరర్ పట్టుకొచ్చాడు.

"ఎలక్షన్లో ఎవరు గెలుస్తారంటావ్?" కల్యాణి అడిగింది.

"ఇంకెవరు శరత్‌కుమారే!"

"అతను మంచోడేలే, పాపం" చంప అన్నాది.

"అసదుల్లా ఎటు పక్క ఉంటే అటు పక్కే కదా మనం కదా." అని ఓరగా మోతీలక్ష్మి వేపు చూసి నవ్వింది ముంతాజ్.

"ఛవ్" మోతీలక్ష్మి చిరుకోపంతో కసిరింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ ఆ సమయంలో అడుగు పెట్టాడు మధు చక్రవర్తి. ఆ పక్కనే విడిగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"యూనో మై నేమీజ్ మధు. మధుచక్రవర్తి. ఫైనల్ బి.కామ్. మై సెల్ఫ్ కంటెస్టింగ్ ఫర్ ప్రెసిడెంట్ షిప్. ఐ వాంట్ యువర్ కోపరేషన్ వాట్ డూ యూ సే మై డియర్ సిస్టర్?"

మోతీలక్ష్మి వేపు చూశాడు.

"సారీ, బ్రదర్, మేము ఇంతకుముందే బ్రదర్ శరత్‌కు ప్రామిసు చేసేశాం. సారీ."

మధు చక్రవర్తి ఏం మాట్లాడలేదు. ఇంతట్లోకి బేరర్ వచ్చాడు.

"ఇంకో స్వీట్" చెప్పింది మోతీలక్ష్మి.

"మీ ఇంటి కొద్దామనుకున్నాను, సిస్టర్. బట్ మీరే కలిశారు. మీరు నాతో సహకరిస్తే కాలేజీలో మీకేం భయం లేకుండా చెయ్యగలను. మీ స్టూడెంట్స్‌కి ప్రాక్టికల్స్ అప్పుడు మార్కులు పెంపించగలను. ఎగ్జామ్స్ సమయంలో ఈజీగా పరీక్షలు రాసే ఏర్పాటు చెయ్యగలను. నా గురించి తెలుసనుకుంటాను. నా చేతిలో చాలామంది లెక్చరర్లున్నారు."

ఇంతట్లో బేరర్ స్వీట్ తెచ్చాడు. మధు చక్రవర్తి ముందు పెట్టాడు. తింటూ "మీ రేమంటారు, సిస్టర్" అని అడిగేడు.

"ఏమీ అనము బ్రదర్. చెప్పాను కదా. శరత్‌కి మాటిచ్చేశాం. వచ్చేసారి చూద్దాం—సారీ." ఓరగా మధువేపు చూస్తూ అన్నది మోతీలక్ష్మి.

"శరత్‌కి మాటిచ్చేరా? అసదుల్లాకి మాటిచ్చేరా?" మధుచక్రవర్తికి ఉక్రోషంగా ఉంది.

"ఎవరికో ఒకరికి మాటిచ్చేం." విసురుగా అన్నది మోతీలక్ష్మి.

"అంతేనా!"

"అంతే మరి." కొంటెగా అంది మోతీ.

"అయితే చూస్తాను—మీరు కాలేజీలోకి ఎలా వెళ్తారో చూస్తాను. ఆ శరత్‌గాడు, అసదుల్లాగాడు ఎలా మిమ్మల్ని అడ్డుకుంటాడో చూస్తాను." కోపంగా స్వీట్ ప్లేట్‌ని ముందుకి తోసేశాడు.

"చూడండి బ్రదర్ ఆవేశ పడకండి. చూద్దాం. మీ ఎదురు ఎదురుగానే కాలేజీకి ఇలాగే వస్తాం." మోతీలక్ష్మి చెలుల అందరి వేపూ చూస్తూ అన్నాది.

లేచిపోయి బయట కొస్తున్నాడు మధు చక్రవర్తి. ఆ సమయంలో చంప 'బ్రదర్' అని పిలిచింది. వెనక్కి చూశాడు మధు చక్రవర్తి.

"స్వీట్ తినరా!" వేళాకోళగా అన్నది.

"బుల్‌షట్!" కోపంగా స్వింగ్‌డోర్ తీసుకుని బయటకొచ్చాడు.

అప్పుడు లోన వరదలా నవ్వులు—అమ్మాయిలందరూ పది నిమిషాల వరకూ నవ్వుకున్నారు. కడుపు పట్టుకుని నవ్వలేక, నవ్వలేక నవ్వుకున్నారు.

• • • •

ఎలక్షన్లు మూడు రోజులున్నాయి.

మూడు లాంతర్ల జంక్షనులో 'గిరీశం బార్లో' ఇరవై మంది కుర్రాళ్ళు కూర్చున్నారు. అందరి మధ్యా ముఖం వేలాడేసుకుని కూర్చున్నాడు మధు చక్రవర్తి.

అప్పుడు మధ్యాహ్నం మూడు గంట లవుతూంది. అప్పటికి అక్కడ నాలుగు ఫుల్ బేగ్ పైపర్ బాటిల్స్ ఖాళీ అయేయి.

"డోంట్ బీ షై. డోంట్ బీ ఫూలిష్, మై యూర్ మ...ధూ..." ఆంజనేయుడు ఓదారుస్తున్నాడు.

"ఎలక్షన్లో నేను గెలవాలి. నేను గెలవాలి నేను గెలవాలి." నేనే గెలవాలి అరిచాడు మధు.

"బ్రదర్ ఒక మాట చెప్తాను వింటావా? ఒకటే మార్గం మనం ఎలాగైనా అసదుల్లాగాణ్ణి పట్టు



కుని రాత్రికి రాత్రి మనవైపు తిప్పుకోవాలి లేకపోతే వాణ్ణి ఎత్తుకొచ్చి దాచేయాలి. శ్రీలక్ష్మిని మనచేతిలో ఉంచుకోవాలి. అప్పుడు ఆడోళ్ళందరూ మనకే వోట్లేస్తారు. జయం మనదే మనదే మందే!" సుభద్రం కేకలు.

"వెధవ పీడిక్కాంచెం మందు పొయ్యండి." మధు విసుక్కున్నాడు. ఆఖరుకు వాళ్ళందరూ అదే నిశ్చయానికొచ్చారు.

"రాత్రి పన్నెండు గంటల లోపల ఎలాగైనా అసదుల్లా గాణ్ణి ఎత్తుకొచ్చెయ్యాలి."

కిడ్నాపింగ్ అదీ పథకం...

• • •

సాయంత్రం అయిదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వెతికేరు. ఎక్కడా అసదుల్లా కనబడలేదు. గురజాడవీధి, రామప్పంతుల పేట, లంకవీధి, వరఖులవారివీధి. ఎక్కడైతే ఉంటాడనుకున్నారో అన్ని చోట్లా వెతికారు. ఎక్కడా లేడు. అసలు వారికి శరత్‌కుమార్ వర్గం ఎక్కడా కనబడలేదు.

అప్పుడు సమయం ఎనిమిది గంటలైంది. మున్సిపాలిటీ లైట్లు మసక మసగ్గా వెలుగుతున్నాయి. మధు చక్రవర్తి వర్గం రాధా బైండింగ్ షాపు దగ్గర నిలబడ్డారు.

సరిగ్గా ఆ సమయంలో బజార్లోకి వెళ్ళి తమ్ముడితో సహా చంప రిక్షాలో వస్తూంది. ఆ రిక్షాని కృష్ణకుమార్ చూశాడు. ఆ విషయం మధుతో చెప్పాడు.

వెంటనే మధుకి ఉదయం హోటల్లో సంగతి జ్ఞాపకానికొచ్చింది. కసి, పగ, కోపం బుసలు కొట్టాయి.

"దాన్ని పట్టుకుంటే వాళ్ళెక్కడున్నారో తెలుస్తుంది రిక్షాని ఆపండి."

పాలోమని రిక్షావాణ్ణి ఆపేరు.

"ఏటి బాబిది..." రిక్షావాడు గబుక్కున దిగి పోయాడు. గాభరాగా రిక్షాలో ఉన్న చంప, తమ్ముడు దిగిపోయారు.

"ఏటి దవుర్జన్యం. ఏటిది ఇస్టూడెంటు కుర్రాళ్ళలా ఉన్నారు..." రిక్షావాడు అరుస్తున్నాడు. వాడి నోరు మూసి ఒకడు మూలకి తీసుకుని వెళ్ళిపోయాడు.

అప్పుడు మధు చక్రవర్తి గబుక్కున చంప జబ్బ పట్టుకుని "శరత్ ఎక్కడ... అసదుల్లా ఎక్కడ...శరత్ ఎక్కడ...అసదుల్లా ఎక్కడ..." అని పిచ్చిగా గబగబా అరిచాడు.

"బిలీవ్ మీ నాకు తెలీదు. నా మాట నమ్మండి. బిలీవ్ మీ" అన్నది చంప.

"నీకు తెలుసు నీకు తెలుసు చెపుతావా, చెప్పవా?" కోపంగా అడిగేడు మధు.

"నాకు తెలీదు నిజం, నిజం." మధుచక్రవర్తి నమ్మలేదు. ఆ అమ్మాయిని గట్టిగా కొట్టేడు. అప్పటికే ఆ అమ్మాయి చెప్పలేదు. అప్పటివరకూ ఆ అమ్మాయిలో ఉన్న ధైర్యం పోయింది. ఒక్కసారి ఏడ్చేసింది. అప్పటికి జనం పోగయ్యారు. ఏమిటి ఏమిటి ప్రశ్నలు ప్రశ్నలు.

మధు చక్రవర్తి ఆ అమ్మాయి జబ్బ వదిలేశాడు. వెంటనే ఆ అమ్మాయి తమ్ముడితో సహా పరుగెత్తి ఆ పక్కనే ఉన్న బుచ్చమ్మ సందులోకి వెళ్ళిపోయింది.

మళ్ళీ వీళ్ళందరూ పారిస్ కార్నర్ జంక్షను కొచ్చారు.

"నువ్వలా చెయ్యడం బాగులేదొరే. ఆ గుంటెళ్ళి బాబుతో చెబితే గొడవలైపోతాయి." రాంబాబు బెరుగ్గా అన్నాడు.

"చూద్దాం. అదీ చూస్తాను." మధుచక్రవర్తికి ఏం చెయ్యాలో తోచటం లేదు. సిగరెట్‌మీద సిగరెట్ కాలుస్తున్నాడు. సరిగ్గా ఆ సమయంలో మధు చక్రవర్తి 'అబ్బావధాన్ల రోడ్డు' వేపు చూశాడు.

అక్కడ తనకు కావలసిన వాళ్ళందరూ ఉన్నారు. శరత్‌కుమార్, అసదుల్లా, సుబ్రమణ్యం, వాని మిగతా ముఖ్యులు. వాళ్ళందరూ జంక్షను దగ్గర కొచ్చారు.


మధు చక్రవర్తి వర్గం పాతిక మంది ఉన్నారు. శరత్ వర్గం దాదాపు అంతే ఉన్నారు.

"ఏమిరా. చంపమీద చెయ్యేసిన లంజా కొడుకెవ్వరా?" అసదుల్లా అరిచాడు. అంతే. పావుగంట సేపు అక్కడ మూడో ప్రపంచ యుద్ధం జరిగింది. ఆ దెబ్బలాటలో పక్కనున్న కిళ్ళీ బడ్డీల్లోని సోడా బుడ్లన్నీ పని కొచ్చాయి. బొంకులదిబ్బ మీద కర్రలన్నీ పైకొచ్చాయి. అలిసి పోయేవరకూ తన్నుకున్నారు.

అరగంట తరవాత అక్కడికి పోలీసులొచ్చారు. అప్పుడక్కడ ఎవరూ లేరు.

'ఎక్కడా ఏమీ శాంతి భద్రతలకు లోపం జరగలేదే' అనుకుని ప్రభుత్వ సేవకులు వెళ్ళిపోయారు

• • • •




రామనాథాన్ని విద్యార్థులే కాదు, తోటి లెక్చరర్లూ గౌరవించరు. ప్రిన్సిపాల్ కూడా అంతే. దానికి కారణం అతనికి విలువ లేకపోవడం కాదు. అతను జడబడా వాగేస్తాడు. ఇష్టం లేనిదాన్ని స్టాఫ్ మీటింగ్ లోనే తిట్టేస్తాడు.

విద్యార్థులను వెంట తిప్పుకుని, వాళ్ళ చేత నానా చాకిరీ చేయించుకుని, కాలేజీల్లో వర్గాల్ని పోషించే వాళ్ళంటే అతనికి అసహ్యం. అందులోనే ఏవరి కులం వాళ్ళని వాళ్ళు చేరదీసుకుని, మార్కులేసుకుని, వాళ్ళ చేత సమ్మెలు చేయించి తమ ప్రతాపాల్ని ప్రదర్శించుకునే లెక్చరర్స్ అన్నా అసహ్యం తనకి. అయినా అతనేం తెలివి తక్కువ వాడూ, అసమర్థుడూ కాడు. అవసరమయితే ఎంతటి లెక్చర్‌స్నయినా నడుప గలిగిన వ్యక్తి అతడు.

కానీ, రామనాథానికి శ్రీపతి అంటే చెడ్డ కోపం. శ్రీపతి రామనాథం కాలేజీలో చేరిన అయిదేళ్ళనాడు చేరాడు. కానీ కాలేజీ, కాలేజీ అంతా శ్రీపతి చెప్పినట్టుగా నడుస్తుంది, ప్రిన్సిపాల్‌తో సహా. ఏమైనా కాలేజీలో గొడవలు జరిగినా, సమ్మెలు జరిగినా, ఏదైనా, ఏ సమయంలోనైనా అతను ఎలాంటి సమస్యనైనా పరిష్కరించ గలడు. దాని క్కారణం అతని చుట్టూ స్టూడెంట్లు ఉంటారు. లెక్చరర్స్ ఉంటారు. అదీగాక అతను మేనేజిమెంట్ తాలూకు మనిషి. అతనికి మేనేజిమెంటుని ఎలాగ ఉపయోగించుకోవాలో తెలుసు. అందుచేత అలాగ ఉపయోగించుకున్నాడు. లెక్చరర్స్‌ని, అందులోనూ కొత్తగా వస్తున్న కుర్ర లెక్చరర్స్‌ని ఎలా తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలో తెలుసు. అందుకే లెక్చరర్స్ దాదాపు అతని మాటంటే వింటారు.

ఆ కాలేజీకి శ్రీపతి ప్రిన్సిపాల్ కాకపోయినా ప్రిన్సిపాల్ లాటి వాడు. పేరుకి వైస్—ప్రిన్సిపాల్ ఉన్నా, సీనియార్టీ దృష్ట్యా ఆ పదవి ఆ వ్యక్తికి వచ్చినా అతను గోడకు కొట్టిన పేడ ముద్దలాంటి వాడు. పేడముద్దల వల్ల పనులవవు. అందువలన

అలాంటి పెద్దమనుష్యుల్ని ఆధారంగా ఉంచి శ్రీపతి లాంటి వ్యక్తులు అధికారాల్ని చెలాయిస్తుంటారు.


అందువలన శ్రీపతి ఒక లాంగ్వేజికి హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అయినా, అన్ని డిపార్ట్‌మెంట్లూ అతని చేతిలో ఉన్నాయి.

అందువలన రామనాథానికి శ్రీపతంటే పీకల వరకూ కోపం. ఆ కోపాన్ని ఎలా ప్రదర్శించాలో తెలీక చాలా ఏళ్ళ బట్టీ రామనాథం చేతకాని వాడిలా పూరుకున్నాడు. ఇప్పుడు సమయం వచ్చింది. అవకాశం చిక్కింది.

ఆ రోజు తొమ్మిది గంటలకు శరత్, మధు చక్రవర్తి వర్గాలు దెబ్బలాడుకున్నాక, వాళ్ళు ఎవరెవరి రూములకు వాళ్ళెళ్ళి పోయారు.

ఆ తరవాత...

అనుచరుల సలహాతో మధు చక్రవర్తి రామనాథం దగ్గర కెళ్ళాడు జరిగిన విషయం చెప్పడానికి. అతనితో ఎందుకు చెప్పాలీ అంటే, కాలేజీలో రామనాథం కులం వాళ్ళు లెక్చరర్లు ఒక పది మంది ఉన్నారు. ఆ పది మందికీ రామనాథం అంటే భయం లేదు. కానీ



గౌరవం ఉంది. తద్వారా కొన్ని పనులౌతాయి. అదీకాక మధుచక్రవర్తిదీ, రామనాథానిదీ ఒకటే కులం.

జరిగినదంతా వివరించాడు మధుచక్రవర్తి.

అప్పుడు రామనాథం లుంగీతో కుర్చీలో మఠం వేసుకుని కూర్చున్నాడు.

మధుచక్రవర్తి, ఆంజనేయుడు, సుభద్రం, రాంబాబు తదితరులు ఎదురుగా బెంచీ మీద కూర్చున్నారు.

"అబ్బాయ్, మధూ. వాళ్ళేమైనా చేస్తారు...ఎందుకు చేస్తారన్నావంటే, వాళ్ళు కాలేజీని ఏలుతున్నారు. అందుకు ఆ శరత్‌గాడికి పుట్టలు కొద్దీ డబ్బుంది. ఆడి బాబుకీ పలుకుబడి ఉంది. అదీగాక కాలేజీలో వాడికి శ్రీపతి గాడి దన్నుంది. అందుకే వాడు విన్నిరెక్కించి నీ మీదే ఉరుకుతున్నాడు."

అగ్గి పొడుంకాయ లోంచి పొడుం తీసుకుని పీల్చి, ఆ కుర్రవాళ్ళ వేపు చూశాడు.

"మన మేమీ చెయ్యలేమా, సార్." సుభద్రం అడిగాడు.

"చెయ్యగలం. వాడొస్తే, మనం కుదేస్తాం. వాడు రెండిస్తే మనం ఒకటిస్తాం. కానీ వాడి రాజకీయం నువ్వు చూశావా. ఏలాగా వాడేం బయటికి తేలిపోడు. అదీ రాజకీయమంటే. అవన్నీ ఆ డాలోచన్లేటి? శ్రీపతిగాడివి. కానీ వాడి ఆటలు ఇంక చెల్లవు. ఇన్నాళ్ళూ నేమా పూరుకున్నాను. ఎందుకూరుకున్నా ననుకున్నావు? సమయం కోసం." ఆపి కొంతసేపు ఆలోచించి, కుర్రాళ్ళకు తెలీని కాలేజీ రహస్యాలు తెలుసుగనుక, వాళ్ళు రేపు చెయ్యాల్సిన పని చెప్పాడు.

దానికి మధు చక్రవర్తి వర్గం ఆనందంతో ఎగిరి గెంతింది. దాదాపు ఒంటిగంటన్నరకు రామనాథం ఇన్ సుండి బయట కొచ్చారు. వాళ్ళు వెళిపోయాక రామనాథం తన పథకమూ, దాని పరిణామమూ మరోకసారి ఆలోచించుకున్నాడు.

నిశ్చింతగా నిద్ర పోయాడు రామనాథం.

• • • •

ఎలక్షన్ ప్రారంభం కావడానికి ఇంకా రెండు గంటల సమయం ఉంది. అప్పటికే కాలేజీకి రక్షణకు ప్రిన్సిపాల్ ఫోను చేయగా పోలీసులుకూడా వచ్చారు.

కాలేజీలోకి విద్యార్థు ల్నెవర్నీ పంపించటం లేదు. కాలేజీ ముందు విద్యార్థులు కొన్ని వేల మంది అరుపులు అల్లర్లు, గోల. స్కూటర్ల శబ్దం, కార్ల హార్న్లు.

లెక్చరర్స్ వరసగా వస్తున్నారు. వాళ్ళని మాత్రం పోలీసులు లోనకి వదులుతున్నారు. శ్రీపతి అతని వెనక కొంతమంది లెక్చరర్లు ఒక్కసారి వచ్చినప్పుడు మధు వర్గం 'చీపతి. చీచీపతి. చీచీ' అని కేకలేశారు.

రామనాథం ఇంకా కాలేజీకి రాలేదు.

కాలేజీ ముందు ఒక పక్క కారులో శరత్‌కుమార్ సుబ్రహ్మణ్యం, అనదుల్లా మిగతా బృందం ఉన్నారు.

కొంతసేపటికి అక్కడికి మధు చక్రవర్తి, మిగతా అనుచరగణం వచ్చారు. వాళ్ళ చేతుల్లో రకరకాల రంగుల్లో ఉన్న పాంప్లెట్లు. పాంప్లెట్లు. వాటిని గుంపులు గుంపులుగా వెదజల్లారు. ఆ కరపత్రాలు పోలీసుల చేతుల్లోకికూడా వెళ్ళాయి. అక్కణ్ణుంచి కాలేజీలోకి వెళ్ళాయి.

రాత్రి రామనాథం చెప్పిన తరవాత అప్పటి కప్పుడు ప్రెస్ తలుపులు తీయించి, రాత్రంతా నిద్ర లేకుండా దగ్గరుండి ప్రింటు చేయించి తెచ్చారు.

కాని అదే సమయంలో స్టాఫ్‌రూమ్‌లో కూచుని పోలింగ్ ఏర్పాటు చేస్తున్న శ్రీపతి ముఖంలో నెత్తురు చుక్క లేదు. శ్రీపతిని సమర్థించే లెక్చరర్ల ముఖాలు వెలవెల బోయాయి.

ఆ కాలేజీలో ఆర్నెల్ల క్రితం పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా కావిడ జాయిన్ అయింది. కాని ఆవిడకి, శ్రీపతికి తొంభై ఏళ్ళ సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయని, అందుకే ఆవిడని ఫుల్‌టైమర్‌గా మార్చడానికి మేనేజిమెంటు ఒప్పుకుందని, ఈ గూడుపుఠాణీలో ప్రిన్సిపాల్ హస్తం కూడా ఉందని, కళాశాలలో గౌరవ నీయంగా బ్రతకాల్సిన అధ్యాపకులే ఇలా అగౌరవ నీయంగా తయారయ్యారని, అలాంటి లెక్చరర్ల వలన విద్యావ్యవస్థ నాశనమైపోతోందని, ఆ జాడ్యం విద్యార్థులక్కూడా వ్యాపించిందని, దానికి నిదర్శనం అనదుల్లా, మోతీలక్ష్మిల ప్రేమ కామకలాపాలే కారణమని, ఈ విషయాలు తెలిసినా ప్రిన్సిపాల్ చేతకానివాడిలా పూరుకుంటున్నాడని, దీనికి మేనేజిమెంటు కళ్ళు తెరవాలని, కళాశాలను కాపాడాలని ఇలా చాలా వివరాలు ఆ కరపత్రంలో ఉన్నాయి.

ఆ కరపత్రంలోనికి వెళ్ళిన అరగంటకి శ్రీపతి బయటకొచ్చాడు. అతని ముఖం కోపంవల్ల ఎర్రగా అయిపోయింది. అతను బయటకొచ్చేసరికి శరత్ వర్గం అతని దగ్గర కెళ్ళారు.

అప్పుడు శ్రీపతి ఏం చెప్పాడో తెలీదు. కానీ వెంటనే శరత్‌వర్గం మధువర్గంమీదకు దాడి చేసింది. మరోసారి యుద్ధం. ప్రళయం. సైకిలు చైన్లతో, సోడాబుడ్లతో, రాళ్ళతో, కర్రలతో ఇరువర్గాల వాళ్ళూ హోరాహోరీగా తన్నుకున్నారు. అక్కడే ఉన్నా కాలేజీకి సంబంధించిన వ్యవహారంలా పోలీసులేం కలగ చేసుకోలేదు. ఆ తర్వాత కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేశారు. పోలీసుగణం వేనులో వచ్చాక ఈ పోలీసులు కూడా కలగ చేసుకున్నారు. శాంతి భద్రతలు కాపాడ్డంకోసం లాఠీలు ప్రయోగించారు. బాష్పగోళ ప్రయోగం చేశారు.

ఎలక్షన్లు జరగలేదు.

విద్యాలయంలో అల్లర్లు, అశాంతి కారణంగా ఎన్నికలను వాయిదా వేశారు. ఆ గొడవలో ఇరు వర్గాల విద్యార్థులకీ బాగానే దెబ్బలు తగిలాయి.

పదిహేను రోజుల తర్వాత ఎన్నికలు జరగాలి.

ఈలోపల వాతావరణం ఇంకా మారిపోయింది. బిగుసుకు పోయింది. విద్యార్థుల మధ్య కావేషాలు, ఆవేశాలు పెరిగిపోయాయి. అధ్యాపకుల్లోనే రెండు వర్గాలుగా చీలిపోయారు. అందరూ ముసుగు ల్లోంచి బయటపడి ఎవరి బలాల్ని వారు సమీక్షించుకున్నారు.

పదిహేను రోజుల తర్వాత జరగాల్సిన ఎన్నికలు కూడా కళాశాలలో అశాంతి తగ్గని కారణంగా మళ్ళీ వాయిదా వేశారు, మరో నెల్లాళ్ళకు.

అప్పటికి విద్యాసంవత్సరంలో ఎనిమిది నెలలు గడిచిపోయాయి.

మళ్ళీ ఈసారి ఎన్నికలు కూడా సక్రమంగా జరగలేదు. కళాశాలలో 'శాశ్వత శాంతి స్థాపన' ఉద్దేశంతో ప్రిన్సిపాల్ ఎన్నికల్ని రద్దు చేశారు. కానీ విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో రగులుకుంటున్న జ్వాలల్ని మాత్రం ఎవడు రద్దు చెయ్యగలడు. ఇరుగా వర్గాల్లో అవి రాజుకుంటూనే ఉన్నాయి. కానీ—

వ్యాపారంకోసం కళాశాలల్ని పెట్టుకుంటున్న ప్రైవేటు మేనేజిమెంటువారూ బాగున్నారు. వందలు, వందలు జీతాలు పుచ్చుకుంటూ, పాఠాలు మాత్రం చెప్పని అధ్యాపకులూ బాగున్నారు. ఆ కళాశాలలకు ఏ విద్యార్థులైతే పునాదో, వాళ్ళ కి వ్యవస్థ సమాధి కట్టేసింది. ★

(ఇది ప్రత్యేకంగా ఏ కళాశాలనీ ఉద్దేశించి రాసింది కాదు. కథ సౌలభ్యంకోసం రాసినదే పేర్లూ, ప్రదేశాలూ అన్నీ కల్పితమే.